క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్ సందర్శన



ఇంటర్‌లో విద్యార్థినికి అడ్మిషన్ అందజేస్తున్న సమగ్ర శిక్ష ఏఎంఓ జగన్‌మోహన్

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీ ఎస్పీ జెడ్పీ హైస్కూల్ ప్లస్‌ను సమగ్ర శిక్ష ఏఎంఓ వి.జగన్‌మోహన్ గురువారం సందర్శించారు. ఏఎంఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి పర్యటనగా ఆయన ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌ను సందర్శించి క్లాస్ రూమ్‌లు, ల్యాబ్‌లు, పుస్తకాలు భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదివేందుకు సుమారు వందకు పైగా అడ్మిషన్లు రావడంతో అధ్యాపకుడు పాల్‌రాజును అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, జగదీష్, రాజు, అలెక్స్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో నాలుగు రోజులుగా కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన నిరసనకు తెరపడింది. వర్సిటీ అధికారులు సర్వీస్ రెన్యూవల్ పేరుతో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు తాము హాజరుకావవంటూ నిరసన తెలిపారు. ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం అధికారులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, లేనిపక్షంలో ప్రత్యామ్నాయం చూస్తామని తెలపడంతో డిపార్టుమెంట్‌ల వారీగా ఆయా అధ్యాపకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

పేదల ఆకలి తీర్చేందుకు..



పేదలకు భోజనం అందించే వాహనాన్ని ప్రారంభిస్తున్న తోట సుధీర్

బోట్‌క్లబ్: సమాజంలో అన్నం లేక బాధపడుతున్న వారికి రోజూ హంగర్ ఫ్రీ వరల్డ్ పథకంలో భోజనం అందిస్తున్న మలబార్‌గోల్డ్ సేవలు మరువలేనివని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ అన్నారు. కాకినాడ మలబార్ గోల్డ్ షోరూం వద్ద గురువారం వరల్డ్ హంగర్ డే సందర్భంగా నగరంలో నిరుపేదలకు భోజనం అందించే వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ఏడాది మలబార్ గ్రూపు సీఎస్ఆర్ కార్యక్రమాలకు రూ.150 కోట్లు కేటాయించడం గొప్ప విషయమన్నారు. మలబార్ డైరెక్టర్ అఖిల్ సత్యజిత్ నాయర్, షోరూమ్ మేనేజర్ సాయి శ్రీకాంత్, మార్కెటింగ్ ఇన్‌చార్జి పి.శ్రీరామ్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవి. కాకినాడ సర్పవరానికి చెందిన గొట్టిముక్కల సూర్య వెంకట చైతన్యరాజు (44)కు అప్పులు అధికమయ్యాయి. దీంతో ఈ నెల 24న రాజమహేంద్రవరం వచ్చి సాయిప్రియ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. అలాగే ఈ నెల 27న కుటుంబీకులకు ఫోన్ చేసి తనకు అప్పులు అధికంగా ఉన్నాయని, ఆ బాధ భరించలేకపోతున్నానని చెప్పాడు. దీంతో వారు అతడి కోసం వెతకసాగారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా సాయిప్రియ లాడ్జిలో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. లాడ్జి తలుపులు తెరిచి చూసేసరికి చైతన్యరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ అవస్థ ఇది

- పూడికలు తొలగించక ఇబ్బంది
- ఎటూ కదలని మురుగు
- దోమలతో ప్రజల సహవాసం



సంజయ్‌నగర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రైనేజీ

బోట్‌క్లబ్: మురుగు ఎటూ కదలదు... కంపు సమస్య వదలదు.. అన్నట్టుంది కాకినాడ స్మార్ట్ సిటీలో డ్రైనేజీల తీరు. కాలువల్లో పూడికలు తొలగించడం లేదు.. సమస్యలు పట్టించుకోవడం లేదు.. అయినా అధికారులెవరూ స్పందించడం లేదు.. నగరంలో ఏ డ్రైనేజీని చూసినా నిండుకుండలా కనిపిస్తుంది. ఇంట్లో మురుగునీరు పోయేదారి లేక ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. నెలల తరబడి డ్రైనేజీల్లో సిల్ట్ తీయకపోవడంతో పూడుకుపోతున్నాయి. దీంతో మురుగునీరు ప్రవహించే పరిస్థితి లేకపోయింది. ఫలితంగా దుర్వాసనతో ప్రజలు సతమతం అవుతున్నారు. గతంలో రెండు, మూడు రోజులకు ఒకసారి పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీల్లో సిల్ట్ తీసేవారు, ప్రస్తుతం నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో రోడ్డుపైకి మురుగు చేరుతోంది. కాకినాడ కార్పొరేషన్‌లో వెయ్యి మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. అయినప్పటికీ డ్రైనేజీలను మాత్రం శుభ్రం చేయడం లేదు. దీనివల్ల దోమలు పెరిగిపోతున్నాయి. రాత్రి సమయాల్లో దోమల ఉధృతి కారణంగా ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సిన వస్తుంది. కార్పొరేషన్ ఉన్నతాధికారులు, నాయకులు ఉన్న ప్రాంతాల్లో మాత్రం పారిశుద్ధ్య సిబ్బంది రోజూ రోడ్లు శుభ్రం చేసి, డ్రైనేజీల్లో చెత్త తొలగిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం అసలు పట్టించుకోవడం లేదు.

ఆ ప్రాంతాల్లో మరీ అధ్వానం

స్థానిక 1వ డివిజన్‌లోని బోట్‌క్లబ్ పార్కు ఎదురు వీధిలో రెండు నెలల నుంచి డ్రైనేజీని శుభ్రం చేయడం లేదు. అలాగే విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులోని డ్రైనేజీని నెలరోజులుగా పట్టించుకోవడం లేదు. దీంతో మురుగునీరు పోయేదారి లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు పడడం లేదు. గతంలో ఒకసారి తప్పనిసరిగా వచ్చి డ్రైనేజీలో చెత్తాచెదారం తీసేవారని ఇప్పుడు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. సంజయ్‌నగర్, దుమ్ములపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని మేజర్ డ్రైనేజీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు అసలు పారడం లేదు.

దోమలు.. ఇబ్బందులు

చీకటిపడితే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో దోమలు నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇంటి తలుపులు తెరిస్తే చాలు దోమల దండు లోపలకు వచ్చి రక్తం పీల్చేస్తున్నారు. విద్యుత్‌నగర్, భగవతి మార్గ్, నాన్సీ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గతంలో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు వినియోగించేవారు. ఆ చర్యలూ కానరావడం లేదు. అధికారులు స్పందించాలని అంతా కోరుతున్నారు.

వర్షం వస్తే ముంపే..

డ్రైనేజీల్లో సిల్ట్ పేరుకుపోవడంతో వర్షం వస్తే వర్షపు నీరు పోయే పరిస్థితి లేదు. దీంతో రోడ్లపైనే వర్షపు నీరు ఉండిపోవడంతో చెరువులా తయారవుతున్నాయి. వర్షం వస్తే మురుగు, వర్షపునీరు కలసిపోయి రోడ్డుపై నుంచి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు.



రాజేశ్వరినగర్‌లోని ఓ వీధిలో డ్రైనేజీలో పేరుకుపోయిన పూడిక

శుభ్రం చేసి నెల అయ్యింది



మా వీధిలో డ్రైనేజీ శుభ్రం చేసి సుమారు నెల రోజులు కావస్తుంది. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు పారడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది బాగానే ఉన్న రోడ్డును శుభ్రం చేసి వెళుతున్నారే తప్ప డ్రైనేజీల్లో చెత్త తీయడం లేదు.

– ఈదర సుబ్బారావు, విద్యుత్‌నగర్

అసలు ఫాగింగే మరిచారు



డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో దోమలు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయంలో దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో మా వీధుల్లో ఫాగింగ్ యంత్రాలతో స్ప్రే చేయడం ద్వారా దోమలు చనిపోయేవి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అసలు ఫాగింగే చేయడం లేదు.

– కె.పద్మజ, రాజేశ్వరినగర్

ప్రపంచ శాంతికి ఐక్యరాజ్య సమితి కీలకపాత్ర

కాకినాడ రూరల్: దేశాలను ఘర్షణల నుంచి శాశ్వత శాంతి వైపు నడిపించేది ఐక్యరాజ్య సమితి మాత్రమేనని మాజీ సైనికోద్యోగి ఎస్.శ్రీనగేష్ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దాదాపు 8 దశాబ్దాలుగా సైనిక, పోలీసు, పౌర శాంతి పరిరక్షకులు చేసిన అమూల్యమైన సహకారంతో శాంతి కొనసాగుతుందన్నారు. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ కార్యకలాపాల్లో 68 వేల మంది కంటే ఎక్కువ మంది పౌరులు, సైనిక, పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారని శ్రీనగేష్ తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గోపురానికి రంగులు

బోట్‌క్లబ్: స్థానిక మహాలక్ష్మి నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ గోపురానికి రంగులు వేసేందుకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఆలయ గోపురానికి దేవతా మూర్తులు ప్రతిమలకు రంగులు వేయాలని ఆలయ కమిటీ సభ్యులు మల్లాడి సాయిబాబు, ఓలేటి వెంకటపతి, ఓలేటి రాజు, చందన కుమార్‌లు, మణికంఠ తనను సంప్రదించారని ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. ఈ విషయాన్ని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబుకు తెలియజేయగా రంగులకు ఎంత ఖర్చయినా తాను వేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు గురువారం రంగులు వేసే పనులను హరీష్ ప్రారంభించారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కాకినాడ సిటీ: ఎస్.అచ్యుతాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నగర కార్యదర్శి టి.అన్నవరం ఆధ్వర్యంలో ఎన్నికల హామీలు తక్షణం అమలు చేయాలంటూ జూన్ 2న జరిగే సీపీఐ నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్ల భూమిని మంజూరు చేస్తానని చెప్పిందన్నారు. ఈ హామీ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా హామీలను నెరవేర్చడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు సొంతిల్లు లేక, ఇంటి అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రసాద్ అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పట్టాలకు స్థలం చూపించాలని, రూ. 5 లక్షల గృహ రుణాలు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరుపై ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, వృద్ధాప్య, వితంతు పింఛన్లు తొలగించకుండా పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. జూన్ 2న ఇళ్ల స్థలాల హామీ అమలు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో రాజేష్, అచ్చారావు, ప్రసాద్, వీరబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: ఆరోగ్యంగా జీవించాలంటే జీర్ణ ప్రక్రియ సక్రమంగా ఉండాలని, ఇందుకు మంచి ఆహారపు అలవాట్లు అవసరమని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నేటి తరంలో రోజురోజుకీ క్షీణిస్తున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక జీర్ణ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. తరచూ ప్రేగుకు సంబంధించిన, మలబద్ధకం వంటి అనేక జీర్ణ సమస్యలతో పలువురు బాధపడుతున్నారన్నారు. జీర్ణక్రియ దెబ్బతినకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ అడ్డాల అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రవిశంకర్ పట్నాయక్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పర్లోవపేట విద్యుత్ ఉపకేంద్రం, గోల్డ్ మార్కెట్ ఫీడర్, ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిల్లోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ గురువారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పర్లోవపేట విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో టిడ్కో బ్లాక్స్, పర్లోవపేట, న్యూ పోర్టు ఏరియా, బీచ్‌రోడ్ ఏరియాలకు, గోల్డ్‌మార్కెట్ ఫీడర్ పరిధిలోని మార్కెట్ ఏరియా, తిలక్ స్ట్రీట్, రాజాజీస్ట్రీట్, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ స్ట్రీట్, సినిమారోడ్డు, గోల్డ్ మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అదే విధంగా 11 కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిలో గోపీకృష్ణ, శివకృష్ణ, ఈశ్వర్ కాలనీలు, ఏటీఆర్ కాలనీ, హౌస్ ఐలాండ్, డ్రైవర్స్, ఏఎస్ఆర్ కాలనీలు, పగడాలపేట, యానాం రోడ్ ఏరియాలకు సరఫరా ఉండదన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోట్‌క్లబ్: డైరీఫారం సెక్షన్ పరిధిలోని విద్యుత్ ఉప కేంద్రం ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచేందుకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ ఎన్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సాంబమూర్తినగర్, రెవెన్యూకాలనీ, దుమ్ములపేట, పల్లంరాజు నగర్, వేంకటేశ్వర కాలనీ, ఈఎస్ఐ హాస్పిటల్, పోర్టు, ఎంప్లాయీస్ కాలనీ, బాలవెంకటనగర్, అయోధ్యనగర్, సెవెన్ హిల్స్ రోడ్డు, డైరీఫారం సెంటర్, ఇందిరానగర్, సత్యనగర్, కుంభాభిషేకం ఏరియా, బీచ్‌రోడ్డు సెక్షన్‌లోని ఇండస్ట్రీస్ అన్నింటికీ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కాకినాడ జిల్లా క్రీడాకారులు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



పోటీల్లో విజేతలు వీరే..

పిఠాపురం: పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ బాల బాలికల బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కాకినాడ జిల్లా నలమూలల నుంచి 45 మంది బాక్సర్లు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఆరుగురు 12 మంది క్రీడాకారులను ఎంపికైనట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మణరావు తెలిపారు.

బాలికల విభాగంలో:

50 కేజీల విభాగంలో పి.మహాలక్ష్మి (పిఠాపురం), 54 కేజీల విభాగంలో ఎల్. రిషిక (కాకినాడ), 57 కేజీల విభాగంలో కె.హర్షిని (పిఠాపురం). 60 కేజీల విభాగంలో సీహెచ్ శ్వేత అంశిక (కాకినాడ). 63 కేజీల విభాగంలో ఎల్.లాస్య (కాకినాడ), 80 కేజీల పైబడిన విభాగంలో జె.ఐశ్వర్య సూర్య దీపిక (పిఠాపురం) స్వర్ణ పతకాలు సాధించి విజేతలుగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

బాలుర విభాగంలో:

46 కేజీల విభాగంలో పి.నాని (పిఠాపురం), 48 కేజీల విభాగంలో డి.రాహుల్ (కాకినాడ), 57 కేజీల విభాగంలో జె.గౌతమ్ (కాకినాడ), 75 కేజీల విభాగంలో జే.రాఘవేంద్ర అరుణ్ (పిఠాపురం), 80 కేజీల విభాగంలో ఎం. అజిత్ హర్ష (తుని), 80 కేజీల కన్నా పై విభాగంలో జె.రాఘవేంద్ర, ఆదిత్య (పిఠాపురం)లు స్వర్ణ పతకాలు సాధించి విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

వీరందరూ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలికల విభాగంలో ఎంపికైన వారు ఈ నెల 31వ తేదీన విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల బాక్సింగ్ పోటీల్లో తలపడతారన్నారు. బాలుర విభాగంలో ఎంపికైన వారు జూన్ రెండో తేదీన విశాఖపట్నం గాజువాక దగ్గర జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాయ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలను పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు. కళాశాల సీనియర్ అసిస్టెంట్ సురేష్ రమణ. కె.చిన్నబ్బాయి, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం తదితరులు ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆసక్తి కలిగిన రంగాల్లో ప్రోత్సహించాలి



వేసవి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న పాలంకి నాగరాజు

పెద్దాపురం: శాఖా గ్రంథాలయాల వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అని అన్నారు. పిల్లలకు ఆసక్తి కలిగిన రంగాల్లో వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఉపాధ్యాయుడు వెంకట్రావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసమే యోగా



సామర్లకోట మండలంలో యోగా శిక్షణ పొందుతున్న సిబ్బంది

సామర్లకోట: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం కనీసం రోజు గంట సమయాన్ని యోగా సాధనకు కేటాయించాలని ఎంపీడీఓ హిమామహేశ్వరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం పి. వేమవరం, ఉండూరు, పనసపాడు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నిర్వహించిన యోగా శిక్షణలో ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయా గ్రామాల్లోని యువతకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం మనం తీసుకొంటున్న ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం యోగా చేయాలన్నారు. టీఓటీలుగా శిక్షణ పొందిన సిబ్బంది ఆయా గ్రామాల్లో ప్రజలకు యోగా శిక్షణ ఇచ్చే సమయంలో ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉత్తమ యోగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న పురస్కారాలు ఉంటాయని తెలిపారు. టీఓటీలకు జగదాంబ, రవి, శ్రీనివాసు, లక్ష్మణకుమార్, యార్లగడ్డ బంగ్రారాజులు యోగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, ఏఓ సతీష్, సీనియర్ అసిస్టెంట్ జగన్నాథరావు పాల్గొన్నారు.

ఇవండీ... సంగోతులు

- పట్టణ రోడ్లలో అడుగుకో గుంత
- ఏడాది పూర్తయినా కనిపించని శ్రద్ధ
- వాహనచోదకులకు తీవ్ర ఇక్కట్లు



గడియారం స్తంభం వద్ద పిఠాపురం రోడ్డులో గోతులు

సామర్లకోట: అడుకో గుంత.. అన్నట్లు ఉంది సామర్లకోట ప్రధాన రోడ్లలో పరిస్థితి. అయినా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి పిఠాపురం రోడ్డు మరింత అధ్వానంగా ఉంది. పట్టణ పరిధిలో రోడ్ల నిర్వహణ బాధ్యత ఆర్అండ్‌బీ అధికారుల పరిధిలో ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. పట్టణ పరిధిలోని కొన్ని రోడ్లు పెద్దాపురం ఆర్అండ్‌బీ పరిధిలోనూ, మరికొన్ని పిఠాపురం ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తున్నాయి. స్థానిక గడియారం స్తంభం నుంచి ఉన్న పిఠాపురం రోడ్డు ఆర్అండ్‌బీ అధికారుల పరిధిలో ఉండటంతో వారు మున్సిపాలిటీలోని రోడ్లపై దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీని కారణంగా పిఠాపురం రోడ్డు గోతులతో ఉన్నా పట్టించుకోవడం లేదనే వాదనలు ఉన్నాయి. గడియారం స్తంభం వద్ద ఉన్న గోతుల కారణంగా ఒక లోడ్ లారీ యాక్సిల్ విరిగిపోవడంతో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు సాయిబాబా మందిరం వద్ద నిలిచిపోయింది.

ఉప ముఖ్యమంత్రి వస్తున్నారని...

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో పవన్‌కల్యాణ్ వెళుతున్నారని తెలిసి పిఠాపురం రోడ్డులోని గోతులను అధికారులు మొక్కుబడిగా పూడ్చారు. డిప్యూటీ సీఎం వెళ్లిన వారం రోజులు గడవక ముందే గోతులు యథాప్రకారం పడిపోయాయి. దాంతో ఆటోలు, మోటారు సైకిళ్లపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గడియారం స్తంభం నుంచి గాంధీచౌక్ వరకూ సీసీ రోడ్డు కావడంతో రోడ్డు బాగుంటుందని భావించి రాత్రి సమయంలో పిఠాపురం నుంచి వచ్చే వాహనచోదకులు ఈ రోడ్డులోని గోతులలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గడియార స్తంభం, సాయిబాబా మందిరం, గాంధీచౌక్, రైతు భవనం, మున్సిపల్ కార్యాలయం, భేతాలస్వామి ఆలయం వరకు రోడ్డు గోతులతో నిండి పోయింది. ఈ రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చడానికి అధికారులు ముందుకు రాకపోవడంతో ఎదురుగా ఉన్న పారిశ్రామిక వేత్తలు సిమెంట్‌తో గోతులను పూడ్పించుకున్నారు.



సాయిబాబా మందిరం వద్ద రహదారిపై గుంతలు



గోతుల కారణంగా విరిగిన లోడ్ లారీ యాక్సిల్

ఉద్యోగ నియామక పత్రం అందజేత

కాకినాడ సిటీ: వీధి సుబ్రహ్మణ్యం గతంలో హత్యకు గురికాగా ఆయన సోదరుడు వీధి నవీన్‌కుమార్‌కు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి నియామక పత్రాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. వీధి నవీన్‌కుమార్‌కు ఉద్యోగ నియామక పత్రం అందజేయడం పట్ల రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ అభినందనలు తెలిపారు.